

8న ప్రధాని విశాఖ రాక

- ఉమ్మడి జిల్లాలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం
- ఏయూలో బహిరంగ సభకు ఏర్పాట్లు
- 4న ముఖ్యమంత్రి రాక
- నేవీ డే పరేడ్‌కు హాజరుకానున్న చంద్రబాబునాయుడు

-వార్త మెయిన్ ఎడిషన్‌లో

ఫుల్ జోష్!



నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల జోరు

- తెగ తాగేసిన మందుబాబులు
- రోజువారీ సగటు మద్యం అమ్మకాలు రూ.3 కోట్లు
- డిసెంబరు చివరి రెండు రోజుల్లో రూ.10.85 కోట్ల వ్యాపారం
- ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖకు భారీగా పెరిగిన ఆదాయం



మద్యం దుకాణంలో వివిధ బ్రాండ్ల సరకు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నిర్వహించిన వేడుకల్లో మద్యం ఏరులై పారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మందు బాబులు తెగ తాగేశారు. కొత్త సంవత్సర వేడుకలను 'ఫుల్' జోష్‌తో జరుపుకున్నారు. యువతతోపాటు పలు వయసుల వారు కూడా మందు పార్టీలు చేసుకున్నారు. దీంతో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డిసెంబరు 31వ తేదీన మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ గణాంకాల ప్రకారం సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు విలువ చేసే మద్యం విక్రయాలు జరిగాయి.

నిబంధనల ప్రకారం మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్‌లు అయితే ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరచి ఉంటాయి. కానీ కొత్త సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మద్యం షాపులను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు, బార్‌లను ఉదయం పది గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు తెరిచి అమ్మకాలు జరుపుకొనేందుకు వెసులుబాటు ఇచ్చింది. దీంతో మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మంగళవారం అర్థరాత్రి వరకు మందుబాబులతో కిటకిటలాడాయి. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే- కూటమి ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించడంతోపాటు నాణ్యమైన బ్రాండ్ల మద్యాన్ని అందుబాటులో ఉంచడంతో మందుబాబులు హ్యాపీగా తాగేశారు. మూడు సీసాలు, ఆరు గ్లాసులతో సందడి చేశారు. దీంతో జిల్లాలో రికార్డుస్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. కొత్త సంవత్సరంతోపాటు చలితీవ్రత పెరగడంతో కొన్ని రకాల మద్యం అమ్మకాలు అధికంగా జరిగాయని అనకాపల్లి పట్టణంలోని ఒక మద్యం షాపు నిర్వాహలు తెలిపారు.

జిల్లాలో 146 మద్యం షాపులు, 10 బార్‌లు ఉన్నాయి. వీటిల్లో రోజూ సగటున రూ.3 కోట్లు మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ లెక్కన డిసెంబరు నెలలో రూ.90 కోట్ల మేర అమ్మకాలు జరగాలి. కానీ రూ.100.85 కోట్ల మేర వ్యాపారం అయ్యింది. ముఖ్యంగా డిసెంబరు 30, 31 తేదీల్లో అన్ని దుకాణాలు, బార్‌లలో మద్యం విక్రయాలు రెట్టింపుకన్నా ఎక్కువ జరిగాయి. లిక్కర్ 13,616 కేసులు, బీర్లు 6,043 కేసులు విక్రయించడం ద్వారా రూ.10.85 కోట్లు ఆదాయం వచ్చింది. జిల్లాలో భారీగా పెరిగిన మద్యం అమ్మకాలతో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం సమకూరింది.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

- అర్ధరాత్రి నుంచి సంబరాలు
- కేక్ కటింగ్‌లు, బాణసంచా కాల్పులతో యువత జోరు
- ప్రజాప్రతినిధులకు పలువురు శుభాకాంక్షలు



యూటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు కొత్త ఆశలతో స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. కొత్త సంవత్సరంలోకి ప్రవేశించే సమయంలో పలువురు బాణసంచా కాల్చారు. యువత బైక్‌లపై తిరుగుతూ సందడి చేశారు. కేక్‌లు కట్ చేసి ఉల్లాసంగా గడిపారు. పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ ఏడాది అన్నీ శుభాలే జరగాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ స్నేహితులు, శ్రేయోభిలాషులు, బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. బుధవారం ఉదయం సమీపంలోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా ప్రతినిధులను వారి నివాసాలు, కార్యాలయాల్లో ఆయా పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి కేంద్ర ప్రభుత్వం ఏడు రోజులపాటు సంతాప దినాలుగా ప్రకటించడంతో మిఠాయిలు, పుష్ప గుచ్ఛాలు, పండ్లు ... మిగతా 6వ పేజీలో

ఇది కదా అభివృద్ధి!

ఐదేళ్ల తరువాత అంకురిస్తున్న విత్తన గిడ్డంగి, శుద్ధి కేంద్రం

- శరవేగంగా గోదాముల నిర్మాణ పనులు
- రెండు నెలల్లో పూర్తిచేయడానికి ప్రయత్నాలు
- ఆరేళ్ల క్రితం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 'సీడ్' కేంద్రం మంజూరు
- గంధవరంలో ఐదు ఎకరాలు కేటాయింపు
- పనులు మొదలయ్యే సమయానికి అధికారంలోకి వచ్చిన వైసీపీ
- ఐదేళ్లపాటు పునాదులకే పరిమితం
- కూటమి ప్రభుత్వం రాకతో కదలిక

నాడు



వైసీపీ హయాంలో పునాదుల్లోనే వున్న విత్తన శుద్ధి కేంద్రం, నిల్వ గోదాముల నిర్మాణం

నేడు



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు

చోడవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

చోడవరం మండలం గంధవరంలో జిల్లాస్థాయి విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆరేళ్ల క్రితం అధికారంలో వున్న తెలుగుదేశం ప్రభుత్వం దీనిని మంజూరు చేయగా, తరువాత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఐదేళ్ల కాలంలో నిర్మాణ పనులు పునాదులకే పరిమితం అయ్యాయి. ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడా విత్తన గిడ్డంగి లేదు. జిల్లా రైతులకు అవసరమైన విత్తనాలు విజయనగరం జిల్లాలోని గోదాము నుంచి సరఫరా అవుతుంటాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతులకు వివిధ పంటల సాగుకు మేలైన విత్తనాలను అందజేయడానికి జిల్లాలోనే విత్తన గిడ్డంగి ఏర్పాటు చేయాలని గతంలో టీడీపీ అధికారంలో వున్నప్పుడు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అవసరమైన ఐదు ఎకరాల భూమిని చోడవరం మండలం గంధవరంలో గుర్తించారు. స్థల సేకరణ పూర్తయ్యే సమయానికి ఎన్నికలు జరిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఏడాది వరకు వీటి నిర్మాణం గురించి పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రూ.4.7 కోట్ల అంచనా వ్యయంతో 2020 జూలై 9వ తేదీన అప్పటి మంత్రులు కె.కన్నబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ విజయసాయిరెడ్డి శంకుస్థాపన చేశారు. 40 వేల క్వింటాళ్ల నిల్వ సామర్థ్యం కలిగిన వీటి నిర్మాణ పనులను ఏడాదిలో పూర్తిచేసి, రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. గోదాముల నిర్మాణ బాధ్యతలను విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించగా టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. గోదాములు నిర్మించాల్సిన స్థలంలో నల్లరాళ్ల గుట్టలు ఉండడంతో అవి తొలగించి స్థలాన్ని అప్పగిస్తే పనులు చేపడతామని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. కొన్ని నెలలు గడిచిన తరువాత నల్లరాయి బ్లాస్టింగ్ కోసం మైనింగ్ శాఖకు దరఖాస్తు చేశారు. అనుమతి వచ్చిన తరువాత రాళ్లను బ్లాస్టింగ్ చేసి, వాటిని అక్కడ నుంచి తీసుకుపోయేందుకు కాంట్రాక్టు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. అయితే నల్లరాళ్లను తీసుకు వెళ్లేందుకు ఎన్ని నెలలైనా ఎవరూ ముందుకు రాలేదు. చివరకు రాళ్లను పక్కకు తొలగించి 2022 అక్టోబరులో నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదులస్థాయి వరకు పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్ బిల్లు అప్‌లోడ్ చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో 2023 ఏప్రిల్‌లో పనులు ఆపేశారు. ఆ సమయంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు.. బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ మంత్రులుగా ... మిగతా 6వ పేజీలో

అనకాపల్లిపై జీవీఎంసీ అధికారుల చిన్నచూపు

అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం

- పూర్తిస్థాయిలో అధికారులు లేని జోనల్ కార్యాలయం
- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ధ్వజం
- రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి
- డంపింగ్ యార్డుకు స్థలాల పరిశీలన
- ప్రభుత్వం దృష్టికి ఆర్‌ఈసీఎస్‌లో అవకతవకలు
- 51 ఎంక్వైరీ వేయాలని అసెంబ్లీలో వినతి
- తుమ్మపాల షుగర్స్ స్థలంలో విత్తన ఉత్పత్తి కంపెనీ



కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్‌ను గాడిలో పెడతానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా పురపాలక సంఘంగా వున్న అనకాపల్లి పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే నాడు జీవీఎంసీలో విలీనానికి అంగీకరించామని గుర్తు చేశారు. అయితే జీవీఎంసీ అధికారులు అనకాపల్లి జోన్‌పై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని, దీంతో అభివృద్ధి విషయంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి పట్టణం, విలీన పంచాయతీలు జీవీఎంసీలో ఒక భాగమనే విషయాన్ని అధికారులు మరిచిపోయారని విమర్శించారు. స్థానిక జోనల్ కార్యాయలంలో పూర్తిస్థాయిలో అధికారులు సైతం లేరని అన్నారు.

మెయిన్ రోడ్డులోని చిననాలుగు రోడ్ల జంక్షన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు రైల్వే స్టేషన్‌రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తవుతాయని, స్థలాలు కోల్పోయిన వారికి త్వరలో టీడీఆర్‌లు అందజేస్తామన్నారు. అయితే కొందరి నివాసాలు 22ఏలో ఉన్నాయని, వీటిపై విచారణ జరిపి 22ఏ నుంచి తొలగించాలని ... మిగతా 6వ పేజీలో



సప్పరం వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

సప్పరం వాహనంపై సప్తగిరీశుడు

నక్కపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఉపమాక క్షేత్రంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి సప్పరం వాహనంపై తిరువీధి సేవ ఘనంగా జరిగింది.



ఉపమాకలో స్వామివారి తిరువీధి సేవ

తొలుత స్వామివారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో అధిష్ఠింపజేసి గ్రామంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

రైతులకూ గుర్తింపు కార్డులు

- రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు
- భూమితో అనుసంధానమైన ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరి
- అందుబాటులో 'అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్‌సైట్'
- గుర్తింపు కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలు కట్

ఎన్నిచోట్ల భూములు ఉన్నా.. ఒకే ఐడీ నంబరు



రైతుల వివరాలు నమోదు చేసే వెబ్‌సైట్ ఇదే

నర్సీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

ప్రజలందరికీ ఆధార్ కార్డు, విద్యార్థులకు అపార్ కార్డు మాదిరిగానే రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. వాస్తవంగా డిసెంబరు 26వ తేదీ నుంచే ఈ ప్రక్రియను మొదలు పెట్టాల్సి వుంది. అయితే పది రోజులు వాయిదా పడింది. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ-కేవైసీ ద్వారా అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలి.

జిల్లాలో సొంత వ్యవసాయ భూములు వున్న రైతులు రెండు లక్షల మందికిపైగా వున్నాయి. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ యోజన కింద జిల్లాలో 1.93 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. రైతుకి ఒక యూనిక్ ఐడీ నంబరుతో గుర్తింపు కార్డు ఇవ్వడం ద్వారా వారికి సంక్షేమ పథకాలు, రాయితీలను పారదర్శకంగా అందించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం రైతు పేరు మీద ఉన్న భూమి, పంటల వివరాలను అగ్రి స్టాక్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తారు. ఇప్పటి వరకు ఒక రైతుకు వేర్వేరు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉంటే రకరకాల ఖాతా నంబర్లతో ఉంటాయి. రైతు గుర్తింపు కార్డు ప్రక్రియ పూర్తి చేస్తే యూనిక్ ఐడీ నంబరు ఒకటే ఉంటుంది. ఒక రైతు పేరున ఎక్కడెక్కడ భూములు వున్నాయో గుర్తింపు కార్డు నంబరు సాయంతో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.

రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు

రైతులు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు స్వయంగా వెళ్లి అగ్రి స్టాక్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. రైతు ఫోన్ నంబరు, అతని పేరు మీద వున్న భూమి వివరాలు ఆధార్ నంబరుతో అనుసంధానం చేసి ఉండాలి. రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ చేసిన అనంతరం ఎన్ని ఎకరాలు ఉంది? ఏయే పంటలు సాగు చేస్తున్నారు? వంటి సమాచారం ఇవ్వాలి. ఈ సమయంలో ఆధార్‌తో లింకైన మొబైల్ ఫోన్ రైతు వద్ద వుండాలి. అన్ని వివరాలు నమోదు చేసిన ... మిగతా 6వ పేజీలో

ఉపాధి కూలీలకు తీపి కబురు

ఇకపై కనీస వేతనం రూ.300 అందేలా కేంద్రం చర్యలు

- రోజువారీ పని గంటలు పెంపు
- ప్రత్యేక కమిటీతో నిరంతర తనిఖీలు



చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఒక శుభవార్త. ఇకపై వారికి రోజుకూలీ రూ.300 కచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రోజుకి కనీసం ఐదు గంటలు పనికల్పించి, మెరుగైన వేతనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉపాధి హామీ పథకంలో కూలీలు ప్రస్తుతం రోజుకు నాలుగు గంటలే పనిచేస్తున్నారు. దీంతో అరకొరగా వేతనం లభిస్తున్నది. పెరిగిన ధరల నేపథ్యంలో కూలి గిట్టుబాటు కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి రావడంతో రోజూ అదనంగా మరో గంట పనికల్పించడంతోపాటు కనీసం రూ.300 వేతనం అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం పనులను తనిఖీ చేసి, ఎక్కువ వేతనం అందించేలా చూడాలని కేంద్రం ఆదేశించింది. పని గంటలు పెంచడం ద్వారా సగటున రూ.300 వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తోంది.

బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పనుల్లో బోగస్ మస్తర్ల వ్యవహారం జోరుగా సాగింది. కూలీలు పనికి రాకున్నా వారికి హాజరు వేసి, వేతనాలు స్వాహా చేశారు. ఈ అవినీతి, అక్రమాలు సామాజిక తనిఖీలు, గ్రామ సభల్లో వెలుగు చూశాయి. వేతన దినాలు దుర్వినియోగం కావడంతోపాటు పనిచేసిన కూలీలకు పూర్తి వేతనం అందడం లేదు. దీంతో ఉపాధి పనుల్లో అక్రమాలను అరికట్టడానికి జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ పనిచేసేలా నిబంధనల్లో మార్పులు చేశారు.

ఇవీ నిబంధనలు

- పని ప్రదేశాల గుర్తింపులో ముందుగా అంచనాలు రూపొందించాలి.
- నేల స్వభావం కూలీలకు పనిచేసేందుకు అనువుగా ఉందా లేదా అనేది గుర్తించాలి.
- జిల్లాను యూనిట్‌గా తీసుకుని కూలీలకు పనులు కల్పించాలి.
- పనివేళల్లో మార్పులు చేయాలి.
- సాంకేతిక సహాయకులు నిత్యం పనులను ... మిగతా 6వ పేజీలో

అన్న క్యాంటీన్‌లో పగిలిన మార్బుల్ టేబుల్

పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకులు



ఎలమంచిలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో భోజనం చేసే మార్బుల్ టేబుల్ కిందపడిపోయి పగిలి ఉండడంతో నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజనాలు ముగించుకుని వెళ్లి సాయంత్రం అన్న క్యాంటీన్‌లోకి వచ్చేశారు. అప్పటికే క్యాంటీన్‌లో ఉన్న మార్బుల్ టేబుల్ పగిలిపోయి ఉండడంతో పాటు చిందర వందరగా పడి ఉండడాన్ని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ సావిత్రిని వివరణ కోగా, అన్న క్యాంటీన్ సెక్యూరిటీపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించాలి.

- ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు తప్పనిసరిగా మస్తర్లు తనిఖీ చేయాలి.
- పని వేళలు, కూలీలు చేసిన పనుల కొలతలు పారదర్శకంగా లెక్కించాలి.



రాంబిల్లి మండలం వెంకటాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, చిత్రంలో కూటమి నాయకులు

మిన్నంటిన నూతన సంవత్సరం సంబరాలు

» కేకులు కట్‌చేసి, ఒకరికి ఒకరు శుభాకాంక్షలు

» ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లు, కార్యాలయాల వద్ద కోలాహలం

ఎలమంచిలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలను నియోజకవర్గ ప్రజలు బుధవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లు, కార్యాలయాల వద్ద కోలాహల వాతారణం నెలకొంది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్‌ల స్వగృహాలకు పెద్ద సంఖ్యలో వెళ్లి బొకేలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపాలిటీ వ్యాప్తంగా ఈ సంబరాలు అంబరాన్నంటాయి. ఇక్కడి టిడ్కో గృహా సముదాయంలో స్థానికులంతా కలిసి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. మంగళవారం రాత్రి ఇళ్ల ముంగిట అందమైన రంగ వల్లులు వేసి అంతా నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

అచ్యుతాపురం : న్యూ ఇయర్ వేడుకలను మండలంలో ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. కేక్‌లు కట్‌చేస్తూ, ఆత్మీయులకు పుష్పగుచ్ఛాలలను అందిస్తూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ఇష్టదైవాలకు పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్దకు ఆయా పార్టీల శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ప్రధానంగా ఈ ప్రాంతం పారిశ్రామిక వాడ కావడంతో ఈ వేడుకలు ఇక్కడ మరింత ఘనంగా జరిగాయి.

రాంబిల్లి : నూతన సంవత్సర వేడుకలను బుధవారం మండల వ్యాప్తంగా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. వెంకటాపురంలోని జనసేన పార్టీ కేంద్రీయ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, దిమిలిలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు. కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అచ్యుతాపురం టీడీపీ కార్యాలయంలో రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును, హరిపురంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులును కూటమి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాపురంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే సోదరుడు సుందరపు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇక్కడి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్ తదితరాల్లో ఈ వేడుకలను జరుపుకున్నారు.



ఎంపీ సీఎం రమేష్‌కు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు చెపుతున్న ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక : నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఆనం దోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు, రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్‌లకు శుభాకాంక్షలు తెలిపేందుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు తరలి వెళ్లారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌కు పలువురు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడి ఎంపీడీవో, తహసీల్దార్ తదితర కార్యాలయాల్లో కోలాహల వాతావరణం నెలకొంది.

ఘనంగా పప్పల చలపతిరావు జన్మదిన వేడుకలు



చలపతిరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, రంగనాయకులు

రాంబిల్లి/ఎలమంచిలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత పప్పల చలపతిరావు జన్మదిన వేడుకలను మండలంలోని దిమిలి గ్రామంలో గల ఆయన స్వగృహంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు, కుటుంబ సభ్యులకు పంచిపెట్టారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వి.దిన్‌బాబు, మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, నాయకులు చెల్లూరి ఆనంద్, ఎరిపిల్లి చిట్టిబాబులతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే, చలపతిరావు జన్మదిన వేడుకలకు ఎలమంచిలి మండలం నుంచి పెద్దసంఖ్యలో వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు కొలుకులూరి విజయ్ బాబు, బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, రాజాన నారాయణమ్మ, బొద్దపు రమణ, అందే రమణ, రాజాన నారాయణమ్మ, యల్లపు గోపి, కరణం రవి, మజ్జి రామకృష్ణ, సుబ్బయ్యనాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

ఏయూ హాకీ జట్టులో ఎలమంచిలికి ఎనలేని గుర్తింపు

» కోచ్, మేనేజర్‌తో పాటు పది మంది క్రీడాకారులు » రేపటి నుంచి తమిళనాడులో పోటీలు



ఏయు హాకీ జట్టులో ఉన్న ఎలమంచిలి క్రీడాకారులు

ఎలమంచిలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీ హాకీ జట్టు కోచ్, మేనేజర్‌గా ఎలమంచిలికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల మూడవ తేదీ నుంచి ఐదు రోజుల పాటు తమిళనాడులోని మద్రాస్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ అంతర్ యూనివర్సిటీల హాకీ టోర్నీ జరుగనుంది. ఈ టోర్నీకి హాజరయ్యే ఆంధ్రా యూనివర్శిటీ జట్టు కోచ్‌గా గేదెల రాంబాబు, మేనేజర్‌గా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొఠారు దుర్గారావులను యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ నియమించింది. వీరిద్దరూ ఎలమంచిలికి చెందిన సీనియర్ క్రీడాకారులు కావడం విశేషం. అదే విధంగా మొదటి సారిగా ఎలమంచిలి నుంచి పది మంది క్రీడాకారులు ఆంధ్రా యూనివర్సిటీ జట్టులో ఆడ నున్నారు. జట్టు కెప్టెన్‌గా ఎలమంచిలికి చెందిన మామిడి వినయ్ ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా ఒకరికినొకరు ఆప్యాయంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పట్టణంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు నివాసం వద్ద జరిగిన ఇయర్ వేడుకల్లో టీడీపీ నాయకులు, అభిమానుల మధ్య చిట్టిబాబు కేక్ కట్‌చేసి అందరికీ అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, పల్లా విలియంకేరి, వి.అప్పారావు, కట్టా శ్రీను పాల్గొన్నారు. అలాగే టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. వైసీపీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఇక తుని, పాయకరావుపేట తాపీ మేస్త్రీల సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు.

అలాగే మండలంలోని గుంటపల్లిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి స్వగృహం, పెంటకోటలో వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఇంటి వద్ద నాయకులు, కార్యకర్తల మధ్య నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, జగ్గన్నదొర, పల్లి దుర్గ పాల్గొన్నారు. నామవరంలో ఎంపీపీ ఇసరపు పార్వతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. అరట్లకోట ఏఎంటీ చర్చిలో పాస్టర్ గెడ్డం జయనాథ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కోటవురట్లలో...

కోటవురట్ల: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు ఇంటికి వెళ్లి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతబాబుకు టీచర్స్ యూనియన్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ఇంటి వద్ద కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో సందడి వాతావరనం నెలకొంది. పార్టీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావుకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల్లో ఎంపీడీవో సువర్ణ రాజుకు, తహసీల్దార్ తిరుమలబాబు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాంకాక్షలు తెలిపారు. మండలంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.





గుంటపల్లిలో గెడ్డం బుజ్జికి శుభాకాంక్షలు తెలుపుతున్న పీఆర్‌టీయూ నేతలు.. ఎస్.రాయవకరం: వినోద్‌రాజుకు పార్టీ శ్రేణుల శుభాకాంక్షలు



కోటవురట్ల: చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత జానకి శ్రీనివాసరావు

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకులను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాలకు చెందిన కూటమి నేతలు, పలు శాఖల అధికారులు పెదగుమ్ములూరులోని మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దంకు కూటమి నేతలు, అధికారులతో పాటు పలువురు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



పెట్టుగొళ్లపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఎస్.రాయవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రద్దు చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పెట్టుగొళ్లపల్లి గ్రామంలో బుధవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా హామీ అమలుకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని విన్నవించారు. అలాగే గత ప్రభుత్వం నిలిపివేసిన అన్ని పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందేలా చూడటంతో పాటు వారి సమస్యలన్నీ పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమణ, గోవింద్, నూకరాజు, అప్పారావు, వెంకన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

‘మత్స్యకారుల తోటలు తొలగింపు అన్యాయం’



చెట్లు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్ డ్రగ్స్ ఏర్పాటుకు మత్స్యకారుల భూముల్లోని దౌర్జన్యంగా తోటలు తొలగించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో వివిధ సర్వే నంబర్లలో కొబ్బరి, జీడి, యాకలిప్టస్, తాటిచెట్లను తొలగించడాన్ని బుధవారం ఎం.అప్పలరాజు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 290లో నష్టపరిహారం చెల్లించకుండా ఏడు ఎకరాల్లో తోటలు తొలగించడం దారుణమన్నారు. అదే విధంగా షైలపల్లి మసేనమ్మ, బొంది కొండమ్మ, బొంది పెంటయ్య తదితరుల భూముల్లో కూడా ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా తోటలు తొలగిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగులో ఉన్న డి.ఫారం పట్టా భూములు, తొలగించిన చెట్లకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎం.మహేష్‌బాబు, ఎం.భయ్యన్న, శివాజీ, రాజు, నవీన్, కె.భూలోక, జి.కాశీ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పాయకరావుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వై జంక్షన్ వద్ద లారీ అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొట్టి మెయిన్ కాలువలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఘోర ప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తుని నుంచి విశాఖ వైపు సిమెంటు బస్తాల లోడుతో వెళ్తున్న లారీ పాయకరావుపేటలోని వై జంక్షన్ వద్ద అదుపుతప్పడంతో పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీకొంది. ఈ క్రమంలో మెయిన్ కాలువపైకి దూసుకుపోయింది. దీంతో కాలువపైన ఉన్న సిమెంట్ పలకలు పగిలిపోయి లారీ చక్రాలు దిగిపోయాయి. లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. మెయిన్ కాలువ ఉండడంతో ఘోర ప్రమాదం తప్పిందని, లేకుంటే ఎదురుగా ఉన్న దుకాణంలోకి దూసుకుపోయేదని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందగా, హైవే అథారిటీ సిబ్బంది క్రేన్ సాయంతో లారీని కాలువలో నుంచి బయటకు తీశారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

... 5వ పేజీ తరువాయి

వంటి వాటిని స్వీకరించలేదు.

శుభాకాంక్షలకే పరిమితం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవిలను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు కూడా వచ్చి మొక్కలు అందజేశారు. యూటీఎఫ్ నేతలు 2025 డైరీని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావులను పలువురు పోలీసు అధికారులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులకూ గుర్తింపు కార్డులు

... 5వ పేజీ తరువాయి

తరువాత మొబైల్ ఫోన్‌కి ఓటీపీ నంబర్ వస్తుంది. దీనిని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జికి చెప్పాలి.

గుర్తింపు కార్డు లేకపోతే పథకాలు కట్!

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, రాయితీలు ఆగిపోతాయి. పీఎం కిసాన్ పథకం సాయం నిలిచిపోతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందదు. అదే విధంగా ఎరువులు, విత్తనాలపై రాయితీలు కోల్పోతారు. ఇటువంటి పరిస్థితి రాకుండా వుండాలంటే రైతులందరూ గుర్తింపు కార్డుల కోసం ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి!

... 5వ పేజీ తరువాయి

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్‌గా వున్నారు. కానీ విత్తన గిడ్డంగి నిర్మాణానికి ఇసుమైంతైనా కృషి చేయలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో మొదలైన పనులు

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో విత్తన గిడ్డంగి పనుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ శరవేగంగా పనులు చేయిస్తున్నారు. తన హయాంలో మంజూరైన విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని తిరిగి తన హయాంలోనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పట్టుదలతో వున్నారు. ఆయన తరచూ గంధవరం వెళ్లి నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా రైతులకు ఎంతో ఉపయోగపడే విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని గత వైసీపీప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయని, మరో రెండు నెలల్లో గోదాములు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఇక్కడ వరితోపాటు ఇతర పంటల విత్తనాలు కూడా నిల్వ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు.

అనకాపల్లిపై జీవీఎంసీ అధికారుల చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు కొణతాల తెలిపారు. జోనల్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న కంపోస్టు యార్డును వేరే ప్రాంతానికి తరలించేందుకు పరిశీలన చేస్తున్నామని, ఇప్పటికే రెండుచోట్ల స్థలాలు చూశామని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. అనకాపల్లి ఆర్‌ఈసీఎస్‌కు ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు, పీవీ రమణ చైర్మన్లుగా వున్నప్పుడు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందాయని, ఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తరువాత సేవలు జరిగా అందడంలేదని అన్నారు. ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని కొణతాల చెప్పారు. ఆర్‌ఈసీఎస్‌లో జరిగిన అవకతవకలపై 51 ఎంక్వైయిరీ వేయాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆర్‌ఈసీఎస్‌ను ప్రక్షాళన చేసి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు.

తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో విత్తన ఉత్పత్తి కంపెనీ లేదా పరిశ్రమ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని, దీనివల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర కర్మాగారాల స్థలాల్లో పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్రీయ విద్యాలయం వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభం అవుతుందని ఆయన వెల్లడించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో రైల్వే సంబంధ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళతానని, రాజుపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెన మంజూరైందని, డీపీఆర్ కూడా తయారైందన్నారు. లక్ష్మీదేవిపేట గేటు వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. మెట్రో రైలును కూర్మన్నపాలెం నుంచి కాకుండా లంకెలపాలెం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని కొణతాల రామకృష్ణ చెప్పారు.

అలరించిన యువత నృత్య ప్రదర్శనలు



కోటవురట్లలోని ఓ చర్చిలో యువతీ, యువకుల నృత్య ప్రదర్శనలు

కోటవురట్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ యువతీ, యువకులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. మండల కేంద్రంలోని క్రీస్తుకృపాలయ బాప్టిస్టు చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమం అదరహో అనిపించింది. అలాగే సాంఘిక నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలాగే ఉపాధ్యాయులు ఎస్‌సంగీతరాజ్, బి.రాజేంద్రప్రసాద్, బిచిట్టిబాబు, జీగంగాభవానీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వందిలాది మంది ఈ కార్యక్రమాలను తిలకించడానికి తరలి వచ్చారు. కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రదర్శనలు అర్ధరాత్రి 12 గంటల వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి

కూర్మావతారంలో పాండురంగడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న పాండురంగస్వామి

పాయకరావుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధారుక్మిణి సహిత పాండు రంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పాండురంగస్వామివారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కృష్ణస్వామి వేకువజామున పాండురంగస్వామి, అమ్మవార్లకు సుప్రభాతసేవ, తిరుప్పావై, అర్చన తదితర పూజాక్రతువులు నిర్విహించారు. అనంతరం దశావతాల్లో భాగంగా స్వామివారిని కూర్మావతారంలో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా కృష్ణస్వామి మాట్లాడుతూ కూర్మావతారంలో స్వామివారిని దర్శించుకుంటే శనిగ్రహ దోషాలు తొలగి పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.దివ్యతేజ, సిబ్బంది సత్తిబాబు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.


దాడి వీరభద్రరావును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు


మాజీ ఎమ్మెల్యే పీలాకు గజమాల వేసి సత్కరిస్తున్న కూటమి నాయకులు


మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్‌కు బొకే ఇచ్చి శుభాకాంక్షలు చెపుతున్న నాయకులు


వైసీపీ నేత భరత్‌కుమార్‌కు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు

వాడవాడలా 'నూతన' వేడుక

▸ మిన్నంటిన న్యూ ఇయర్ సంబరాలు ▸ ఆలయాలు కిటకిట ▸ ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లు, కార్యాలయాల్లో సందడి

అనకాపల్లి టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకలు బుధవారం మిన్నంటాయి. ఉదయం నుంచి ఏ ఇంటి చూసినా, ఏ వీధి చూసినా కోలహల వాతావరణం కనిపించింది. ఆలయాలు కిటకిటలాడాయి. బంధుగణంతో ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనం దంగా కనిపించారు. ఇక ప్రజాప్రతినిధుల ఇళ్లు, అధికారుల కార్యాలయాలు మరింత సందడిగా మారాయి. పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, గ్రీటింగ్‌లతో ఆయా పార్టీల శ్రేణులు, అభిమానులు, ఉద్యోగులు, సిబ్బంది తరలివచ్చారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఈ వేడుకలు మిన్నంటాయి. కొణతాల సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద ఉన్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, ఏడీ స్కూల్ కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్‌కు, సంతబయలు నివాసంలో ఉన్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రత్నాకర్, సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రింగురోడ్డులోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, కోర్టుకు ఎదురుగా ఉన్న ఇంటిలో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్రలను నియోజకవర్గంలోని కూటమి నాయకులు, వివిధ విభాగాల అధికారులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దాడి వీరభద్రరావు నివాసంలో ఆయనను ఎంపీ సీఎం రమేష్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలు, పీలా తదితర నాయకులను, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, పీఎస్‌కే రాజు, కోట్ని బాలాజీ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కొణతాలను కూడా ఎంపీ సీఎం రమేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొణతాలను మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జి, తిప్పల నాగిరెడ్డిలు కలిసి శుభాకాంక్షలను తెలియజేశారు. రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలావుంటే,నూకాంబిక అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు మళ్ల సరేంద్ర తదితరులు దర్శించుకున్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేసి, శుభాకాంక్షలు తెలిపారు. బొంకుల దిబ్బయూత్ అసోసియేషన్ ప్రతినిధులు పైలా పైడంనాయుడు, హరీశ్, గండి వాసు, పైలా వెంకటరావు, లక్ష్మణరావు, ముకేశ్, చిన్నా, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి మండలం నలుమూలల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావులను వైసీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : నూతన సంవత్సర వేడుకలు మండలంలో మిన్నంటాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు పెందుర్తిలోని తన క్యాంప్ కార్యాలయంలోను, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ గండి బాబ్జీకి మొగలిపురం తన స్వగ్రామంలోను, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వెన్నలపాలెంలోని తన స్వగృహంలోను కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ఎన్ రాజు, నేతలు గండి దేముడు, ఇందలి రమణ, కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, కొటాన అప్పారావు, గండి ముత్యాలనాయుడు, దాసరి రమణ, దొడ్డి ప్రకాశ్, ఎ.దుర్గినాయుడు, రేసుపూడి రమణ, కోరాడ శ్రీను, ఆకుల గణేష్, వడిసల రమేశ్, ఆడారి నాగరాజు, రొంగలి దేముడు, బోకం సత్యనారాయణ, బర్ల రమణ, బి.సూర్యప్రసాద్, వి.సంతోష్, అక్కుబాబు, బలిరెడ్డి అప్పారావు, వి.కనకరాజు, పడాల శ్రీను, బి.అప్పారావు, బొండా రాజు పాల్గొన్నారు. ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియాజేశారు.


అనకాపల్లిలో కేక్‌కట్ చేస్తున్న ఎంపీ సీఎం రమేష్


ఎమ్మెల్యే కొణతాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నాయకులు


సబ్బవరం : పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో

కొత్తూరు : అనకాపల్లి పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఎంపీ సీఎం రమేష్ కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్‌టీయూకు సంబంధించిన క్యాలెండర్, డైరీలను ఎంపీ రమేష్ ఆవిష్కరిచారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం మూలపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరంలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే ఇవ్వాలని, ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సిహెచ్. అప్పలరాజు, సహాయ కార్యదర్శి చిన్ని గణేష్, చిన్న, గుమ్మాల నాగేశ్వరరావు, సత్తిబాబు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


మొగలిపురంలో ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


వెన్నలపాలెంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు


పరవాడలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది


అనకాపల్లిలో నూకాంబిక అమ్మవారికి గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పూజలు

ఇష్టారాజ్యంగా గోతులు తవ్వకం

▸ పరవాడ- తానాం గ్రామాల మధ్య భయం.. భయంగా రాకపోకలు

▸ ఇటీవల కురిసిన వర్షాలతో ప్రమాదాలకు గురైన పలువురు వాహనచోదకులు



పరవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ నుంచి తానాం వెళ్లే ప్రధాన రహదారిలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు నిమిత్తం తవ్విన గోతులతో ప్రమాదం పొంచి ఉంది. రహదారిని ఆనుకొని పలు చోట్ల పెద్ద గోతులు తవ్వి వదిలేశారు. సుమారు ఇరవై రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మార్గం చిత్తడిగా మారి వాహనచోదకులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పలువురు అదుపు తప్పి బోల్తాపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రహదారికి ఆనుకొని తవ్విన గోతుల వద్ద ఎలాంటి భద్రత సూచికలు లేకపోవడంతో భయాందోళనకు గురిచేస్తోంది. రాత్రి సమయంలో ఇటుగా ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఆయా గోతులు పూడ్చివేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పరవాడ రైస్ మిల్లు సమీపంలో రహదారికి ఆనుకొని తవ్విన గొయ్యి

పరవాడ పాఠశాల జోన్ సమీపంలో స్పీడ్ బ్రేకర్

▸ ప్రమాదాల నివారణకు ఎట్టకేలకు ఆర్అండ్‌బీ శాఖ చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పరవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలోని ఇక్కడి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సమీపంలో స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. 'పాఠశాల జోన్‌లో ప్రమాద ఘంటిక' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రమాదకరంగా దర్శనమిస్తున్న పాఠశాల జోన్ సమీపంలో రహదారిపై స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రమాదాల జరిగే అవకాశం తక్కువని భావించవచ్చు. స్పీడ్ బ్రేకర్ దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, ఇటీవల కాలంలో ఇదే రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీస్ స్టేషన్, చింతల గొర్లెవానిపాలెం, జాజులవాని పాలెం, దేశపాత్రునిపాలెం సమీపంలోనూ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.


పాఠశాల జోన్ సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

నేటి నుంచి పాలిటెక్నిక్ రీజనల్ స్పోర్ట్స్ మీట్

▸ 24 కళాశాలల నుంచి హాజరు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రీజనల్ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ మీట్‌లో భాగంగా ముందుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 8 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 16 ప్రైవేటు కళాశాలల నుంచి సుమారు 1,116మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసుపై వివాదం

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వయోపరిమితిపై వివాదం నెలకొంది. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచారు. అదే జీవీఎంసీలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అనధికారికంగా అమలు చేస్తూ వస్తున్నారు. ప్రజారోగ్య విభాగంలో సుమారు ఆరు వేల మంది, నీటి సరఫరా, యూజీడీ ఇతర విభాగాల్లో మరో రెండు వేల మంది వరకూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే ప్రజారోగ్య విభాగంలో 60 ఏళ్లు దాటిన 400 మంది కార్మికులకు ఉద్యోగ విరమణ చేయాలంటూ జీవీఎంసీ అధికారులు ఇటీవల నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 62 ఏళ్ల పరిమితి ఉండడంతో వారికి కూడా అదే నిబంధన వర్తిస్తుందని, హఠాత్తుగా 60 ఏళ్లు దాటినందున ఉద్యోగ విరమణ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని కార్మిక సంఘాల నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను కలిశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నిబంధన ప్రకారం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 ఏళ్లు మాత్రమేనని, తాను రెండేళ్లు పెంచి 60 ఏళ్ల వరకూ పనిచేసే అవకాశం కల్పించానని కమిషనర్ వివరణ ఇచ్చారు. అందుకు సంబంధించి ప్రభుత్వం గతంలో జారీచేసిన ఉత్తర్వులను యూనియన్ నేతలకు చూపించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 62ఏళ్ల పరిమితి వర్తింపజేయాలని నేతలు డిమాండ్ చేశారు. అయినప్పటికీ తానేమీ చేయలేనని కమిషనర్ చెప్పడంతో, ఆందోళనకు దిగాలని నిర్ణయించామని నాయకులు చెబుతున్నారు.

5న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ముత్యాల ముగ్గుల పోటీలు

▸ అనకాపల్లి ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ

అనకాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్ర జ్యోతి', ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు...గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)'కు అన కాపల్లిలోని ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ...ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు.

ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (ఫోన్ నంబర్: 99854 11045) చేయించుకోవాలి. అనకాపల్లిలో నిర్వహించే పోటీ లకు 'కొణతాల సుబ్రహ్మణ్యం, అప్పలనరసమ్మ ట్రస్టు' స్పాన్సర్‌గా వ్యవహరించనున్నది

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

▸ రూ.23,850 నగదు, ఐదు బైక్‌లు స్వాధీనం

మునగపాక, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : మండలం లోని చెర్లోపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు ముందస్తుగా మంగళవారం సాయంత్రం సమాచారం అందిందన్నారు. వెంటనే సిబ్బందితో వెళ్లి దాడిచేశామన్నారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. రూ.23,850 నగదుతో పాటు ఐదు బైక్‌లను సీజ్ చేసినట్టు చెప్పారు.

వీజేపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

▸ ఎక్స్‌కవేటర్ల సహాయంతో కొండలను తొలిచి తరలింపు

▸ ప్రభుత్వ భూములను సైతం పలుచోట్ల కబ్జా


▸ పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు



కొత్తూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వేటజంగాల (వీజే)పాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి సమయంలో కొండలను ఎక్సకవేటర్ల సహాయంతో తొలిచి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. గ్రామ సర్వే నంబర్ 84లో గ్రావెల్ తవ్వకాలు జరిపి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ భూములను కబ్జా చేసి, ఆ స్థలాల్లో ముందుగా మొక్కలు నాటుతున్నారు. ఆ తరువాత నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రామంలో ఇంత జరుగుతున్నా కనీసం వీఆర్‌వోగానీ, పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు పలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ, మైనింగ్, పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ గ్రావెల్ తవ్వకాలు అరికట్టడంతో పాటు ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్థులంతా కోరుతున్నారు.


వేటజంగాలపాలెంలో అక్రమంగా గ్రావెల్ తవ్విన ప్రదేశాలు

పూడిమడక తీరానికి తాబేళ్ల కళేబరాలు



అచ్యుతాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడిమడక తీరానికి బుధవారం రెండు తాబేళ్ల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. వీటిని చూసిన మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా తాబేళ్లు చనిపోవని, సముద్రంలో కలుషిత జలాలు కలవడం వల్లే ఇలా మృతిచెంది తీరానికి కొట్టుకుని వస్తున్నాయని వాపోతున్నారు. సెజ్‌లోని కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాలు శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెడుతుండడం వల్లే తాబేళ్లతో పాటు చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు ఆరోపించారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో మత్స్యకారుల జీవన భృతికే విఘాతం కలగనుందన్నారు.



ఎంపీ తనూజారాణికి పుష్పగుచ్ఛమిస్తున్న ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు..



మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు



కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ రీజినల్ చైర్మన్ దొన్నుదొర

నూతన సంవత్సర సందడి

అధికారులు, ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ

పాడేరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో పీవో వి.అభిషేక్ కేక్ కట్ చేసి అధికారులకు, ఉద్యోగులకు పంచిపెట్టారు. ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఇతర విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ, ఉపా ధ్యాయ సంఘాలకు చెందిన నేతలు పీవోకు పుష్పగుచ్ఛాలు అందించి పీవోకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌కలెక్టర్ వి.అభిశేక్‌కు ఐటీడీఏలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, తాహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ ఉద్యో గులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సబ్‌కలెక్టర్ శార్యమన్‌పటేల్, జిల్లా ఉద్యాన శాఖాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్.రజని, డీఈవో బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో సి.జమాల్‌బాషా, డీపీఆర్‌వో గోవిందరా వు, డీఎల్‌పీఆర్‌వో పి.రాములు, ఇతర జిల్లా అధికారుల కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గి డ్డి ఈశ్వరి, స్థానిక క్యాంప్ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు శ్రావణ్‌కుమార్, ఈశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపారు. అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంప్ కార్యాలయాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కు జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, టూరిజం డైరెక్టర్ కేవీ.రమేశ్‌నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు పాండురంగస్వామి, బాకూరు వెంకటరమణరాజు, కేవీ.సురేశ్‌కుమార్, పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కుమ్మరిపుట్టుల మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి నియోజకవర్గంలోని నేతలు, స్థానిక వర్తక సంఘ ప్రముఖులు, ఉద్యోగులు,ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

జి.మాడుగుల: స్థానిక చుట్టుమెట్టలో గ్రోత్ ఇన్ క్రైస్ట్ మిషన్ సాలం చర్చిలో బిషప్, రెవ డా. వి.తిమోతి పాస్టర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సవర వేడుకలు నిర్వహించారు. అనంతరం పలువురికి సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు పాస్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు బి.అరుణ్‌కుమార్, తలారి సత్యనారాయణ, వడ్డాది శ్రీనివాసరావు, ఎస్కే అమీర్, కమిడి జాన్‌రాజ్, గొర్లి గణేశ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని మాలింగవలసలో హౌస్ ఆఫ్ జీసస్ చర్చులో స్థానిక సంఘకాపరి పి.పీటర్ ఏసుక్రీస్తు గొప్పతనంపై వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాల ఆకట్టుకున్నాయి.. గిరిజన మహిళలకు చీరలు, చిన్నారులకు కంచాలు, గ్లాసులు, అందజేశారు. ఈ కార్యక్రమంలోని ఫిలిప్, చరణ్, చిన్నరాయుడు, సింహాద్రి, మహిమ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు నూతన సంతర్సరం పురస్కరించుకుని కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దుంబ్రిగుడలో...

హుకుంపేట: మండలంలోని నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కు టీడీపీ నాయకులు సుశీల శుభాకాంక్షలు తెలిపి మిఠాయి తినిపించారు. ఉపాధ్యాయుల యూనియన్ మండల అధ్యక్షులు సత్యారావు, పలువురు ప్రతినిధులు ఎంపీ తనూజారాణి, జీసీసీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేతలు సాగరి ప్రభాకర్, చిన్నారావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు వసంతకుమారి, మాజీ ఎంపీపీ ధనిరావు, నాయకులు సుబ్బారావు, ఎంపీటీసీ స్వామి, సర్పంచ్‌లు సత్యవతి శశిభూషణ్ నాయుడు ఎంపీటీసీ కోమ్మ రమ, నాయకులు సాగరి సుబ్బారావు, చప్పాలి శంకర్ , రామలింగం, సూర్యకాంతం, బాకూరు వెంకట రమణ, సత్యనారాయణ కాంట్రాక్టర్లు పైడిరాజు, కోరిబెలి ప్రవీణ్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: పాడేరు టీడీపీ నియోజక ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి మండలానికి చెందిన టీడీపీ నాయకులు మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు ఆధ్వర్యంలో బుధవారం ఆమె స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిముడు కల్యాణం, వి. చిరంజీవినాయుడు, ఎ. సన్యాసినాయుడు, జి.కుమారి, పి.కొండబాబు, ఎ. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలకు కేక్ లు పంపిణీ

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో బుధవారం కాంగ్రెస్ నాయకులు పలు చర్చిలకు నూతన సంవత్సరం పురష్కరించుకుని కేక్‌లను పంపిణీ చేశారు. స్థానిక యూసీఐఎం, కల్వరి,పెంతుకోస్తు, గేస్తేమన్నే, షాలేము చర్చిలకు నాయకులు, గ్రామపెద్దలు వెళ్లి క్రైస్తవ సోదరులకునూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం చర్చి పాస్టర్లకు కేక్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, సర్పంచ్ పి. దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు`పి. సాంబమూర్తి, నాయకులు శ్యామ్‌సన్, వానపల్లి అప్పారావు, కారే బంగారయ్య, మట్టం దారబాబు పాల్గొన్నారు.

చింతపల్లిలో ..

చింతపల్లి: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పర్యాటక ప్రాంతాలైన లంబసింగి, చింతపల్లితోపాటు పలు గ్రామాల్లో ప్రజలు మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌లు కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం ఉదయం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఎంఈవో పీబీవీవీ ప్రసాద్‌తో కేక్‌ను కట్ చేయించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రవి కుమార్ కేక్ కట్ చేశారు. అనంతరం వివిధ సంఘాలు క్యాలెండర్లను ఎంఈవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, గిరిజన ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దూపూరి శశి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.



ఐటీడీఏలో నిర్వహించిన వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు



ఎమ్మెల్యే మత్స్యలింగంనకు..



సీలేరులో కేక్ అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్టీసీ రీజియన్ చైర్మన్, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు

అరకులోయ: విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొరకు స్థానిక సర్పంచ్ దాసుబాబు,వార్డుమెంబర్లు, ఎస్సీ కార్యవర్గం నాయకులు, వర్తక సంఘం నేతలు, ఎమ్మెల్యే రేగం మత్సలింగంనకు ఉపాధ్యా సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ముంచంగిపుట్టు: మండల పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన వెంటనే కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. ఎంపీపీ సీతమ్మకు ఎంపీడీవో శ్రీహర్షసాయితోపాటుసిబ్బంది పూలగుచ్ఛంతో శుభాకాంక్షలు చెప్పారు.

చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

పెదబయలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలను వినియోగించడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కంపెనీ కమాండెంట్ త్రిలోచన్ బేరా పేర్కొన్నారు. బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని రూఢకోట పోలీస్ ఆవుట్ పోస్టు ఆవరణలో చిరుధాన్యాల ఉపయోగాలపై పరిసర గ్రామాలకు చెందిన గిరిజన మహిళలకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు రాగులు, జొన్నలు, సామలు తదితర చిరుధాన్యాలను తమ ఆహారంలో చేర్చుకోవటంతో ఎక్కువ కాలం జీవించేవారన్నారు. ప్రస్తుతం చిరు ధాన్యాలను విడిచి జంక్ ఫుడ్‌లను తినటంతో అనేక వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం పది రకాల చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించి వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. ఈ వంటకాలను అనంతరం మహిళలకు, పిల్లలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ హల్ల, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ డేను విజయవంతం చేయాలి

పాడేరురూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పాడేరులో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎలక్ట్రీషియన్ డేను విజయవంతం చేయాలని మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ఫ్లంబర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు కోరారు. బుధవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల సంక్షేమానికి కార్యవర్గం చేస్తున్న కృషికి అభినందించదగిన విషయమన్నారు. సభ్యులకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘ సభ్యుడు గుంట సింహాద్రి భార్య మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ. 5 వేలు అందించారు. ఎలక్ట్రీషియన్ డే రోజున జిల్లా నూతన కార్యవర్గ ఎంపికను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సందడి దామోదరం, డివిజన్ అధ్యక్షుడు పొట్లూరు బబ్లు, సరమండ వర ప్రసాద్, కె.సత్యారావు, కె.సన్యాసిరావు, జి.సింహాద్రి, పి.వెంకట్, జి.చిట్టిబాబు, జి.యశోద, ఓ.బాలరాజు, ప్రసాద్, నరేంద్ర, కొండబాబు, రాంబాబు పాల్గొన్నారు.

సందడిగా నూతన సంవత్సర వేడుకలు

... 5వ పేజీ తరువాయి

వంటి వాటిని స్వీకరించలేదు.

శుభాకాంక్షలకే పరిమితం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని అధికారులు, ఉద్యోగులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవిలను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు కూడా వచ్చి మొక్కలు అందజేశారు. యూటీఎఫ్ నేతలు 2025 డైరీని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావులను పలువురు పోలీసు అధికారులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు.

అనకాపల్లిపై జీవీఎంసీ అధికారుల చిన్నచూపు

... 5వ పేజీ తరువాయి

జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు కొణతాల తెలిపారు. జోనల్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న కంపోస్టు యార్డును వేరే ప్రాంతానికి తరలించేందుకు పరిశీలన చేస్తున్నామని, ఇప్పటికే రెండుచోట్ల స్థలాలు చూశామని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. అనకాపల్లి ఆర్‌ఈసీఎస్‌కు ఎస్‌ఆర్‌ఏఎస్ అప్పలనాయుడు, పీవీ రమణ చైర్మన్లుగా వున్నప్పుడు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందాయని, ఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తరువాత సేవలు జరిగా అందడంలేదని అన్నారు. ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని కొణతాల చెప్పారు. ఆర్‌ఈసీఎస్‌లో జరిగిన అవకతవకలపై 51 ఎంక్వైయిరీ వేయాలని అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆర్‌ఈసీఎస్‌ను ప్రక్షాళన చేసి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు.

తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో విత్తన ఉత్పత్తి కంపెనీ లేదా పరిశ్రమ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని, దీనివల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఏటికొప్పాక,తాండవ సహకార చక్కెర కర్మాగారాల స్థలాల్లో పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కేంద్రీయ విద్యాలయం వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభం అవుతుందని ఆయన వెల్లడించారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో రైల్వే సంబంధ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళతానని, రాజుపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెన మంజూరైందని, డీపీఆర్ కూడా తయారైందన్నారు. లక్ష్మీదేవిపేట గేటు వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. మెట్రో రైలును కూర్మన్నపాలెం నుంచి కాకుండా లంకెలపాలెం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని కొణతాల రామకృష్ణ చెప్పారు.

ఇది కదా అభివృద్ధి!

... 5వ పేజీ తరువాయి

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రభుత్వ విప్‌గా వున్నారు. కానీ విత్తన గిడ్డంగి నిర్మాణానికి ఇసుమైంతైనా కృషి చేయలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో మొదలైన పనులు

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో విత్తన గిడ్డంగి పనుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ శరవేగంగా పనులు చేయిస్తున్నారు. తన హయాంలో మంజూరైన విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని తిరిగి తన హయాంలోనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పట్టుదలతో వున్నారు. ఆయన తరచూ గంధవరం వెళ్లి నిర్మాణ పనులను పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా రైతులకు ఎంతో ఉపయోగపడే విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని గత వైసీపీప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయని, మరో రెండు నెలల్లో గోదాములు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఇక్కడ వరితోపాటు ఇతర పంటల విత్తనాలు కూడా నిల్వ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించాలి.

- ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు తప్పనిసరిగా మస్తర్లు తనిఖీ చేయాలి.
- పని వేళలు, కూలీలు చేసిన పనుల కొలతలు పారదర్శకంగా లెక్కించాలి.

స్థిరమైన కూలి లభిస్తుంది



జాబ్ కార్డు ఉన్న వారందరికీ రోజువారీ వేతనం రూ.300 అందేలా చూస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు కూలీల పని వేళలను నాలుగు గంటల నుంచి ఐదు గంటలకు పెంచాము. దీనివల్ల కచ్చితంగా గిట్టుబాటు కూలి లభిస్తుంది. పనివేళలు, వేతనం పెంపుపై కూలీలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రస్తుతం చెరువుల్లో నీరు వుంది. మరోవైపు వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ఉపాధి పనులు త్వరలో ప్రారంభం అవుతాయి.

-నాగరాజు, ఏపీవో, ఉపాధి హామీ పథకం

రైతులకూ గుర్తింపు కార్డులు

... 5వ పేజీ తరువాయి

తరువాత మొబైల్ ఫోన్‌కి ఓటీపీ నంబర్ వస్తుంది. దీనిని రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జికి చెప్పాలి.

గుర్తింపు కార్డు లేకపోతే పథకాలు కట్!

రైతు గుర్తింపు కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, రాయితీలు ఆగిపోతాయి. పీఎం కిసాన్ పథకం సాయం నిలిచిపోతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందదు. అదే విధంగా ఎరువులు, విత్తనాలపై రాయితీలు కోల్పోతారు. ఇటువంటి పరిస్థితి రాకుండా వుండాలంటే రైతులందరూ గుర్తింపు కార్డుల కోసం ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

తెలుగునాడు డైరీలు, క్యాలెండర్లు పంపిణీ



సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు డైరీ, క్యాలెండర్లు అందిస్తున్న నాయకులు

సీలేరు, జనవరి 1, (ఆంధ్రజ్యోతి): జీకెవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో తెలుగునాడు విద్యుత్ సంఘం నాయకులు బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని స్థానిక కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో అధికారులను కలిశారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరెడ్డిలకు యూనియన్ నాయకులు డైరీ, క్యాలెండర్లు, పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగనాడు యూ నియన్ రీజనల్ సెక్రటరీ ఎస్. భాస్కరరావు, బ్రాంచి అధ్యక్షుడు ఆర్ అప్పారావు, కా ర్యదర్శి వి. కృష్ణ, సీనియర్ సభ్యుడు ఎన్. వరప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ముంచంగిపుట్టు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2025 డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో కృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, మండలంలో విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నేతలు కామేష్, మాలయ్య, చిన్నిగున్నిపడాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

6న సైన్స్ ఫెయిర్



జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు

పెదబయలు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాడేరు తలార్సింగిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 6వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించనున్నట్టు జిల్లా సైన్స్ అధికారి, స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల- 1 ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత సన్స్ ఫెయిర్ 2024-2025లో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) ఆదేశాల మేరకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు వివరించారు.డీఈవో బ్రహ్మాజీరావు పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులు విధిగా పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు పాడేరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పాడేరులో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త 11 కేవీ బ్రేకర్స్ మార్చనున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు



పాఠశాలలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు

కొయ్యూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సామూహిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో రికార్డుల ప్రకారంగా జనవరి ఒకటో తేదీన జన్మించిన 30 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. ఈ విషయం గుర్తించిన ఉపాధ్యాయుడు బెనర్జీ వారందరికీ సామూహికంగా జన్మదిన వేడుకలు పాఠశాలలో నిర్వహించాలని తలపించారు.ఈ నేపథ్యంలో సిబ్బంది, సహ విద్యార్థులంతా కలిసి బుధవారం ఉదయం పుట్టిరోజు అయిన సుమారు 30 మంది విద్యార్థులతో సామూహికంగా కేక్ కట్ చేయించి మిగిలిన విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయించారు. ఆంగ్ల నూతన సంవత్సరం కావటంతో రెండు పండగలు నిర్వహించడంతో పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం నెలకొంది. పిల్లల పుట్టిన రోజు జరిపిన ఉపాధ్యాయులకు విద్యార్థులు, తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ



రగ్గులను పంపిణీ చేస్తున్న డీటీ సత్యనారాయణ

చింతపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దుచ్చరిపాలెంలో ఆదివాసీలకు గూడెంకొత్తవీధి ఉప తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ తన సొంత నిధులతో బుధవారం రగ్గులు, దుప్పల్లు పంపిణీ చేశారు. గ్రామంలో 102 కుటుంబాలకు వీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి తీవ్రత పెరగడంతో గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు అందజేసినట్టు వివరించారు. ఈకార్యక్రమంలో వీఆర్వో వసుపరి లింగాలు పాల్గొన్నారు.

మనాపల్లిలో ..

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆదివాసీలకు సర్పంచ్ కుందరి రామకృష్ణ దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం వ్యాపారులు బి. గోవింద్, బి. జగదీశ్ ఆర్థిక సహకారంతో నూతన సంవత్సరం పురస్కరించుని గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసినట్టు సర్పంచ్ తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ అభిమానుల క్యాలెండర్ ఆవిష్కరణ



సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అభిమానులు

పాడేరురూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు బుధవారం స్థానిక ఉమా నీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు మాట్లాడుతూ ఏటా జనవరి ఒకటో తేదీన కృష్ణ, మహేష్‌బాబు కుటుంబ సభ్యుల ఫొటోలతో క్యాలెండర్ ముద్రించి అభిమానులకు పంపిణీ చేస్తుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రామంపంతులు, అభిమాన సంఘం ప్రతినిధులు శివరాత్రి నాగేశ్వరరావు, వెయ్యాకుల సత్యనారాయణ, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, పచ్చా బుజ్జి, వియ్యపు అప్పలరాజు, క్షత్రియ సూర్యసింగ్, పి.నూక అప్పారావు, పాడి గిరి కుమార్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

650 టన్నుల కాఫీ గింజల కొనుగోలు లక్ష్యం

జీసీసీ డీఎం దేవరాజు



మాట్లాడుతున్న డీఎం .దేవరాజు

చింతపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 650టన్నుల కాఫీ గింజలు కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు గిరిజన సహకారం సంస్థ డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో జీసీసీ ఉద్యోగులతో డీఎం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈఏడాది కాఫీకి మంచి ధర లభిస్తోందన్నారు. గిరిజన సహకార సంస్థ గరిష్ఠ ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కాఫీ పార్చిమెర్చిమెంట్ కిలో రూ.320, చెర్రీ రూ.170, రొబస్టా రూ.100 ధర చెల్లిస్తున్నట్టు వివరించారు. ఈ ధరల వివరాలను ఉద్యోగులు రైతులకు తెలియ జేయాలన్నారు. రైతులు దళారులకు విక్రయించి నష్టపోకుండగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎంకి ఉద్యోగులునూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కొయ్యూరు మేనేజర్ సరమండ విజయ కుమార్ పాల్గొన్నారు.

గురుకుల సిబ్బంది నిర్లక్ష్యంతోనే అత్యాచార ఘటన

హెచ్‌ఎం, వార్డెన్లపై చర్యలు కోసం

బాధిత కుటుంబం వినతులు

పాడేరురూరల్/ జి.మాడుగుల జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలంలోని ఓ గిరిజన సంక్షేమశాఖ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న తన కుమార్తెపై జరిగిన అత్యాచారం ఘటనలో పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌లు నిర్లక్ష్యం ఉందని, ఈ నేపథ్యంలో వారిద్దరినీ సస్పెండ్ చేయాలని కోరుతూ బాధిత బాలిక తండ్రి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణతో కలిసి బుధవారం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, అరకు ఎంపీ గుమ్మ తనూజా రాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వినతి పత్రాలందించారు. బాలిక అని కూడా చూడ కుండా ఆమెపై అసత్య ఆరోపణలు చేస్తున్న అధికారులు, పాఠశాల సిబ్బందిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల విద్యార్థుల పర్యవేక్షణ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందన్నారు. తిరిగి అధికారులు తన కుమార్తెపై నిందలు మోపుతున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం వారి తప్పు కప్పిపుచ్చుకొనేందుకు బాలిక పై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. బాధ్యతారహితంగా మాట్లాడుతున్న హెచ్‌ఎం, వార్డెన్‌లను సస్పెండ్ చేయాలని వారు ప్రజాప్రతినిధులను కోరారు. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, గిరిజన సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నర్సీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలువురు బాధితులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ జరిగింది. నర్సీపట్నం క్యాంప్ కార్యాలయంలో నాతవరం మండలానికి చెందిన కొమ్మన శ్రీనివాస్‌కు రూ.1.8 లక్షలు, గొలుగొండ మండలం కొత్త ఎల్లవరానికి చెందిన బేబీ ఘనేశ్వరికి రూ.1.55 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలోని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 14 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ఎల్లవరం సర్పంచ్ రాంబాబు, టీడీపీ నాతవరం మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పార్టీ నేత కాశీ పాల్గొన్నారు.

తొలి నెలలోనే వితంతు పింఛన్



ఏఎల్‌పురంలో ఎల్లమ్మకు పింఛన్ అందిస్తున్న వేణుగోపాల్

కృష్ణాదేవిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భర్త చనిపోయిన నెలలోనే వితంతు పింఛన్ అందిస్తున్నట్టు గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో గత నెల మృతిచెందిన చింతల రాజులునాయుడు పింఛన్‌ను, అతని భార్య చింతల ఎల్లమ్మకు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ మొత్తాన్ని బుధవారం ఎల్లమ్మకు అందించామన్నారు. భర్త చనిపోతే మరుసటి నెలలోనే పింఛన్ ఇవ్వడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డు జమీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ



అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందిస్తున్న ఉప సర్పంచ్

రావికమతం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు పడిపోయి కాలు విరిగిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును బుధవారం చినపాచిల ఉప సర్పంచ్ కోమటి శంకరరావు, వీఆర్పీ కె.ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లి అందజేశారు. మండలంలో చినపాచిల గ్రామానికి చెందిన కొర్ని అచ్చియ్యమ్మ(75) వారం రోజుల క్రితం ఇంటి వద్దే ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. దీంతో ఆమెకు కుడి కాలు విరిగి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో చేరడంతో వైద్యులు ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ మంచానికే పరిమితమైన అచ్చియ్యమ్మకు పింఛన్ సొమ్మును నేరుగా ఆసుపత్రికి వెళ్లి ఉప సర్పంచ్, వీఆర్పీ అందజేశారు.

కూటమి ప్రభుత్వంతో మరింత అభివృద్ధి

- టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న పాత్రుడు

మాకవరపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే మరింత అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు అన్నారు. తామరం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. 2024లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎంతో సహకరించారని, అలాగే 2025లో కూడా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం డీటీ సోమశేఖర్, ఎస్ఐ దామోదర్‌నాయుడుకు, ఎంపీడీవో సీతామహాలక్ష్మికి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు రుత్తల శేషుకుమార్, పీఏసీఎస్ మాజీఅధ్యక్షుడు అల్లు రామునాయుడు, టీడీపీ నాయకులు వి.గోవింద, ఆర్.జోగిపాత్రుడు, దువ్వాసీ వెంకటగిరి, కోసూరు శ్రీనువాసరావు, లాలం రాము, శంకర్‌గిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమంలో స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కె.కోటపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొండుపాలెం గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయ తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది గంటలకు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, అనంతరం భక్తి కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం తోడపెద్దుసేవ, రాత్రికి భజన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

నూతన సంవత్సరం.. ఆనందోత్సాహం


ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

రాజకీయ నాయకులు, అధికారులకు

శుభాకాంక్షలు చెప్పేందుకు ఉద్యోగులు, నాయకుల బారులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. గ్రామాల్లో పండగ వాతావరణం

నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సందడిగా జరుపుకున్నారు. కొత్త ఏడాదికి గ్రాండ్‌గా స్వాగతం పలికిన గ్రామీణ ప్రజలు, తొలి రోజును ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు ప్రజాప్రతినిధుల ఇళ్లకు ఉద్యోగులు, కార్యకర్తలు క్యూ కట్టారు. కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జనసేన చోడవరం ఇన్‌చార్జి రాజుకు నాయకుల శుభాకాంక్షలు





చోడవరం ఎమ్మెల్యే రాజుతో పాటు, మల్లునాయుడు, పెదబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు... బుచ్చెయ్యపేటలో తాతయ్యబాబుకు సత్కారం

చోడవరం/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకలు సందడిగా సాగాయి. చోడవరం పట్టణంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చర్చిలలో న్యూ ఇయర్‌ను స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్థానిక లక్ష్మమ్మ ఆలయం కల్యాణ మండపం వద్ద వేడుకలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, నాయకులు సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీను, నేమాల హరి పాల్గొన్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడుకు అతని నివాసం వద్ద కార్యకర్తలు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజుకు నాయకులు అల్లం రామప్పారావు, ఎస్.రమేష్, జి.మూలినాయుడు, కర్రి రమేష్, ఎన్.సరోజిని శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బుచ్చెయ్యపేట మండలంలోని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు నివాసం శుభాకాంక్షలు చెప్పడానికి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. రావికమతం మండలంలోని టి.అర్జాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడును, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముక్కామహాలక్ష్మినాయుడును, ఎంపిపీ పైల రాజును, వైసీపీ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆసర వాసుగోవిందరావుకు తహసీల్దార్ బి.వెంకటరమణ, సీఐ కోటేశ్వరావు శుభాకాంక్షలు తెలిపారు. రోలుగుంట నాయకులు చోడవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ టీడీపీ సీనియర్ నేత పోతల శ్రీనివాసరావు మండల అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు ఆర్.రమణ, బి.రమేష్ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆనందోత్సహంతో నిర్వహించారు. మాడుగుల మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సరోజినికి ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కె.భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు రెడ్డి బలరామమూర్తి, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కె.కోటపాడు మండల నాయకులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలోని మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే బండారును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, కె.కోటపాడు టీడీపీ నేత డి.నరసింహమూర్తి పాల్గొన్నారు. చీడికాడ ఎంపీపీ కురచా జయమ్మ, ఎంపీడీవో హేమసుందర్రావు, ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావుకు సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పండ్లు, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ మండల అధ్యక్షుడు జి.రాజబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీడీవోలకు శుభాకాంక్షలు తెలిపారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...

నర్సీపట్నం/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం/నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీబీ మాజీ ఛైర్‌పర్సన్ సిహెచ్.అనిత, సన్యాసిపాత్రుడు, వేములపూడిలో మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాపకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణాదేవిపేట పరిధిలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.



నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే గణేశ్‌ను పూలదండతో సత్కరిస్తున్న దృశ్యం

ఏఎల్‌పురం సర్పంచ్, వైసీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొందల రాజు, గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారికి నాయకులు, ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నాతవరం మండలంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్సలకు కార్మికులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌కు వేణుగోపాల్‌కు అధికారులు, సచివాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అలాగే కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నాతవరం వరసిద్ధి వినాయకుని ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు ఈ వేడుకలలో మండల పరిషత్ పరిపాలనాధికారి పి.పార్థసారధి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, స్థానిక నాయకులు సుర్ల అచ్చియ్యనాయుడు, దేవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.





మాడుగుల ఎమ్మెల్యే బండారుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు... ఏఎల్‌పురంలో నూతన సంవత్సర వేడుకల్లో బొందల రాజు తదితరులు

ఒమ్మిలి సచివాలయంలో సౌకర్యాల కొరత

రన్నింగ్ వాటర్ లేమితో ఉద్యోగులు, ప్రజల పాట్లు

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాడుగుల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి. దీంతో సచివాలయ సిబ్బంది, అక్కడికి వచ్చే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు.

మండలంలోని ఒమ్మిలి గ్రామ సచివాలయంలో పలు సమస్యలు నెలకొన్నాయి. భవనం లోపల నిర్మించిన మరుగు దొడ్లకు పైపులైన్లు ఏర్పాటు చేయకపోవడంతో రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. ఈ సచివాలయ భవనం బయట సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు ఈ మరుగుదొడ్లు వినియోగించుకోవడానికి కూడా రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. దీంతో ఇక్కడి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. బయట ఉన్న మరుగుదొడ్లలో మహిళలకు కేటాయించిన గదులకు తాళం వేశారు. దీంతో పురుషులకు కేటాయించిన మరుగుదొడ్డిని వాడుతున్నారు. ఇందులో పెద్ద ప్లాస్టిక్ డబ్బా ఏర్పాటు చేసి, నీరు నింపుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళా సిబ్బందితో పాటు పలు పనులు మీద వచ్చే మహిళలు మరుగుదొడ్డు వినియోగించుకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించే పాలకులు, అధికారులే ఈ విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



నీటి సదుపాయం లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

5న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

అనకాపల్లి ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ

విజేతలకు నగదు బహుమతుల బహూకరణ

అనకాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే 'ఆంధ్రజ్యోతి', 'ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి', ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్...ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)కు అనకాపల్లిలోని ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం వేదిక కానున్నది. ఈ నెల ఐదో తేదీ...ఆదివారం ఉదయం పది గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి.

ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.4 వేలు, రూ.3 వేలు బహుమతిగా అందించనున్నారు. ముగ్గు, రంగులు వగైరా సామగ్రి పోటీదారులే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. పోటీల్లో పాల్గొనాలనుకునేవారు తమ పేర్లు రిజిస్ట్రేషన్ (ఫోన్ నంబర్: 99854 11045) చేయించుకోవాలి. అనకాపల్లిలో నిర్వహించే పోటీలకు 'కొణతాల సుబ్రహ్మణ్యం, అప్పలనరసమ్మ ట్రస్టు' స్పాన్సర్‌గా వ్యవహరించనున్నది.

పూడిమడక తీరానికి తాబేళ్ల కళేబరాలు

- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు





తీరానికి కొట్టుకు వచ్చిన తాబేళ్ల కళేబరాలు

అచ్యుతాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక తీరానికి బుధవారం రెండు తాబేళ్ల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. వీటిని చూసిన మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా తాబేళ్లు చనిపోవని, సముద్రంలో కలుషిత జలాలు కలవడం వల్లే ఇలా మృతి చెంది తీరానికి కొట్టుకుని వస్తున్నాయని వాపోతున్నారు. సెజ్‌లోని కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థాలు శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెడుతుండడం వల్లే తాబేళ్లతో పాటు చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు ఆరోపించారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో మత్స్యకారుల జీవన భృతికే విఘాతం కలగనుందన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పాయకరావుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వై జంక్షన్ వద్ద లారీ అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొట్టి మెయిన్ కాలువలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఘోర ప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తుని నుంచి విశాఖ వైపు సిమెంటు బస్తాల లోడుతో వెళ్తున్న లారీ పాయకరావుపేటలోని వై జంక్షన్ వద్ద అదుపుతప్పడంతో పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీకొంది. ఈ క్రమంలో మెయిన్ కాలువపైకి దూసుకుపోయింది. దీంతో కాలువపైన ఉన్న సిమెంట్ పలకలు పగిలిపోయి లారీ చక్రాలు దిగిపోయాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. మెయిన్ కాలువ ఉండడంతో ఘోర ప్రమాదం తప్పిందని, లేకుంటే ఎదురుగా ఉన్న దుకాణంలోకి దూసుకుపోయేదని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందగా, హైవే అథారిటీ సిబ్బంది క్రేన్ సాయంతో లారీని కాలువలో నుంచి బయటకు తీశారు.

7న దేవానంద సరస్వతి మహారాజ్ ఆరాధన మహోత్సవాలు

దేవరాపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామంలో ఈ నెల 7న దేవానంద సరస్వతి మహారాజ్ ఆరాధన మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నట్టు దేవనాంద సరస్వతి కొత్తపెంట ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని, దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు కోసం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సుప్రభాత సేవ, నగర సంకీర్తన, అన్న సమారాధన తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్

రోలుగుంట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ బుధవారం ఆవిష్కరించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కొవ్వూరుకు చెందిన సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరాజులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, పేదలకు వస్త్రాల పంపిణీ

నర్సీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగార్రాజు థియేటర్ రోడ్డును వస్త్ర వ్యాపారి కాసాపు రాంబాబు రెండు వేల మంది దివ్యాంగులు, పేదలకు బుధవారం వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే నూతన సంవత్సరం సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేశ్‌తో కేట్ కట్ చేయించి మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన దివ్యాంగులకు వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్నదని ఈ సందర్భంగా నిర్వాహకుడు రాము తెలిపారు.